ఈనాడు
నిర్మల్
గురువారం అక్టోబరు 3, 2024



నిర్మల్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు, విద్యార్థినులు

మొదలైన పూల పండగ





మహాలయ అమావాస్య రోజైన బుధవారం రాత్రి బతుకమ్మ సంబరాలు మొదలయ్యాయి. జిల్లా కేంద్రంలోని పలు కళాశాలల్లో, వార్డుల్లో మహిళలు, విద్యార్థినులు ఎంగిలిపూల బతుకమ్మ ఆడారు. సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఆడుతూ తెలంగాణ సంస్కృతిని చాటిచెబుతూ సందడి చేశారు. - న్యూస్‌టుడే, నిర్మల్

నెత్తిన బతుకమ్మతో మహిళ



బాసర ఆర్జీయూకేటీలో బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు



నిర్మల్‌లో యువతి

సమస్య తీరేదెలా.. చెత్త తొలగేదెలా..



నారాయణరెడ్డి మార్కెట్‌లో దుకాణ సముదాయాల ఎదుట చెత్త నిల్వలు

జీతాలు చెల్లించాలంటూ మున్సిపల్ కార్మికులు విధులు బహిష్కరించారు. దీంతో పట్టణంలోని వ్యాపార సముదాయాల్లో, మార్కెట్లో ఎక్కడికక్కడ చెత్త నిల్వలు పేరుకుపోయి రహదారులు, వాహనాలు నిలిపే ప్రదేశాలు చిందరవందరగా మారాయి. దుర్గా నవరాత్రులు, బతుకమ్మ, దసరా పండగ వేళ కార్మికుల సమ్మె ఇలాగే కొనసాగితే పరిస్థితి అధ్వానంగా తయారయ్యేలా ఉంది. - చిత్రం: న్యూస్‌టుడే, నిర్మల్

ఖానాపూర్‌లో డే అండ్ నైట్ క్రికెట్ పోటీలు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జై భీమ్ డే అండ్ నైట్ సర్కిల్ క్రికెట్ పోటీలను బుధవారం రాత్రి నిర్వాహకులు ప్రారంభించారు. పుర ఛైర్మన్ సత్యంతో పాటు నాయకులు తరలివచ్చారు. ఖానాపూర్ పట్టణంలో తొలిసారిగా డే అండ్ నైట్ క్రికెట్ పోటీలు నిర్వహించడంతో చూసేందుకు ప్రేక్షకులు తరలివచ్చారు.


నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నిర్మల్: పట్టణంలోని బంగల్‌పేట్, గాజుల్‌పేట్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా గురువారం 9.30 నుంచి 10.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ రవి తెలిపారు. వ్యవసాయ మార్కెట్, మోచిగల్లి, బుధవార్‌పేట్, గాంధీచౌక్, కబుతర్‌కమాన్, బంగల్‌పేట్, నాయుడివాడ, బోయవాడ, రాంరావ్‌బాగ్, గాజుల్‌పేట్, డాక్టర్స్‌లేన్‌లలో కరెంటు సరఫరా ఉండదని తెలిపారు.

విద్యాశాఖకు మచ్చ..

- ఆన్‌లైన్ పెట్టుబడుల వ్యవహారంలో ఉపాధ్యాయుల పాత్ర

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: పాఠాలు బోధిస్తూ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులది. ఓ రకంగా సమాజానికి దిక్సూచీ లాంటి వారు. అలాంటి వృత్తిలోని కొందరు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆ శాఖకే మాయని మచ్చగా మారుతున్నారు. జిల్లాలో ఇటీవల సంచలనం సృష్టించిన యూబిట్ కాయిన్ ఆన్‌లైన్ పెట్టుబడుల వ్యవహారంలో ఉపాధ్యాయులే పెద్దసంఖ్యలో ఉండటం దీనికి నిదర్శనం.



పాఠాలు వదిలి..

ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెడితే అధిక వడ్డీ వస్తుందని, తద్వారా సులభంగా ఆదాయం పొందవచ్చంటూ పిరమిడ్ తరహా పథకాన్ని విస్తృతం చేశారు. ఇందులో ప్రభుత్వ ఉపాధ్యాయులు సైతం సభ్యులుగా చేరారు. మొదట్లో వచ్చిన లాభాలకు ఆశపడి పూర్తిస్థాయిలో అదే పనిలో నిమగ్నమయ్యారు. ఇందుకోసం తమ విధులను సైతం నిర్లక్ష్యం చేశారు. తరగతులు వదిలి ప్రజలను ఆకట్టుకునే ప్రచార కార్యక్రమాల్లో భాగమయ్యారు. సదస్సులు, సమావేశాలు నిర్వహించడం, ప్రత్యేకంగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటుచేయడం, నలుగురు కలిసిన చోట ఈ తతంగంపై ఆకట్టుకునేరీతిలో ప్రచారం చేయడం అలవాటుగా మార్చుకున్నారు. ఒకరిని చూసి ఒకరు.. ఇలా పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు ఈ వ్యవహారంలో మునిగిపోయారు. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లకుండా జాగ్రత్తపడ్డారు. ఇంకొందరు తమ పలుకుబడి, పైరవీలతో తమకు ఇబ్బందుల్లేకుండా చూసుకున్నారు. ఇదంతా గత కొద్ది నెలలుగా చాపకిందనీరులా సాగిపోతోంది. జరిగిన వ్యవహారంపై దృష్టి సారించిన పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్టుచేశారు. వీరిలో జిల్లాకు చెందిన నలుగురు, పొరుగు జిల్లాకు చెందిన మరొకరు.. మొత్తంగా అయిదుగురు ఉపాధ్యాయులు ఉండటం గమనార్హం.

కూపీ లాగుతున్న పోలీసులు

విచారణలో భాగంగా పోలీసులు పట్టుబడ్డ వారి నుంచి కూపీ లాగుతున్నారు. విదేశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు, వారి వ్యవహారశైలి, అనుమతులు తీసుకున్నారా లేదా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే జిల్లా విద్యాధికారిని సంప్రదించిన పోలీసులు పూర్తిస్థాయి సమాచారం కోసం ఆరాతీస్తున్నారు. వారు అడిగిన అంశాల ఆధారంగా జిల్లాలో యూబిట్ కాయిన్ వ్యవహారంతో సంబంధం ఉన్న ఉపాధ్యాయులు, వారిలో ఎవరు, ఎలాంటి పర్యటనలకు వెళ్లారనే కోణంలో విద్యాశాఖ అధికారులు సమాచార సేకరణలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

అనుమానాస్పదం.. అధికారుల పనితనం

ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం స్థానికుల్లో అనుమానాలను రేకెత్తించింది. పోలీసులు కేసు నమోదుచేసి, రిమాండ్‌కు తరలించిన వారిని శాఖాపరంగా సస్పెండ్ చేశారు. అయితే. కొన్నినెలలుగా ఈ వ్యవహారం సాగుతున్నా, విద్యార్థిసంఘాల నుంచి విమర్శలు, ఫిర్యాదులు వచ్చినా స్పందించకపోవడం అధికారుల పనితీరును ప్రశ్నార్థకం చేసింది. వాస్తవానికి.. ఏ కారణంచేతనైనా విదేశీ పర్యటనలకు వెళ్లాలంటే ఉపాధ్యాయులు ముందుగా ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. కానీ, కొందరు అలాంటి అనుమతులేవీ లేకుండా, తగిన సమాచారం ఇవ్వకుండానే పర్యటనకు వెళ్లినట్లు ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల నుంచి ఫిర్యాదులొచ్చాయి. కానీ, వాటిపై అంతగా దృష్టి సారించకపోవడంపై సంఘనేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం వారికి పరోక్ష ప్రోత్సాహాన్ని అందించిందనే వాదనలూ లేకపోలేదు.

చర్యలు తప్పవు:
రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి, నిర్మల్

ఉపాధ్యాయులు ముందస్తు అనుమతి లేకుండా విదేశీ పర్యటనలకు వెళ్లడం నిబంధనలకు విరుద్ధం. అలా ఎవరైనా వెళ్లినట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ పెట్టుబడుల వ్యవహారంలో సంబంధం ఉన్న నలుగురు ఉపాధ్యాయులను ఇప్పటికే సస్పెండ్ చేశాం. వీరిలో ఒకరు విదేశాలకు వెళ్లినట్లు గుర్తించాం. కానీ అతను ముందస్తు అనుమతి తీసుకున్నారు. మరొకరు పాస్‌పోర్టు పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. వీరే కాకుండా ఇంకా ఎవరైనా విదేశాలకు వెళ్లారా అనే విషయమై ఆరా తీస్తున్నాం. ఉపాధ్యాయులు తమ ఉద్యోగబాధ్యతలను విస్మరిస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో భాగం కావొద్దు. లేనిపోని ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దు.

ధ్రువపత్రాల పరిశీలన



పరిశీలిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి, పరిశీలన బృందం సభ్యులు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్ మండలం కొండాపూర్‌లోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం నిర్వహించారు. డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి కేంద్రాన్ని సందర్శించారు. ఉన్నతాధికారులు పంపించిన జాబితా మేరకు 1:3 నిష్పత్తి ప్రకారం నిజ ధ్రువపత్రాలతోపాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన రెండు జిరాక్స్ ప్రతులను పక్కాగా పరిశీలించాలని చెప్పారు. ఏవైనా సందేహాలుంటే సాంకేతిక బృందం సహాయం తీసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ ర్యాంకుల ఆధారంగా కేటాయించిన గదుల్లో పత్రాలను పరిశీలన చేయించుకోవాలని సూచించారు. ప్రక్రియ సమాచారం ఎప్పటికప్పుడు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ deonirmal.weebly.com లో పొందుపర్చనున్నట్లు పేర్కొన్నారు. నిపుణులైన ఎంఈవో, ప్రధానోపాధ్యాయులతో 12 బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. విద్యాశాఖ సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొలువు కోసం.. ఎన్నెన్ని కష్టాలో..



గద్దెలపై కూర్చొని చెక్‌లిస్టు దరఖాస్తు పత్రాల్లో వివరాలు నమోదు చేస్తున్న అభ్యర్థులు

ధ్రువపత్రాల పరిశీలనకు కొండాపూర్ వచ్చిన డీఎస్సీకి అర్హత సాధించిన అభ్యర్థులు చెక్‌లిస్టు దరఖాస్తు పత్రాల్లో వివరాలు నిక్షిప్తం చేసేందుకు ఆవరణలోని గద్దెలపై, మెట్లపై కూర్చొని ప్రయాసపడ్డారు. చిన్నారులతో తల్లిదండ్రులు, పోషకులు రావడంతో వారిని ఆడిపిస్తూ, తినిపిస్తూ కనిపించారు.



నిద్రపోతున్న పాపను ఎత్తుకుని..



గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అభిలాషఅభినవ్, అదనపు కలెక్టర్లు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, అధికారులు



నివాళులర్పిస్తున్న ఎస్పీ జానకి షర్మిల



బహుమతి అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్, చిత్రంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక

మహాత్ముడి బాటలో పయనిద్దాం

నిర్మల్, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన బాటలో మనమంతా పయనిద్దామని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గాంధీ జయంతి జరిపారు. జాతిపిత చిత్రపటానికి అదనపు కలెక్టర్లు కిషోర్‌కుమార్, ఫైజాన్‌అహ్మద్‌లతో కలిసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో శాంతియుత మార్గంలో పోరాటం చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.

గాంధీ అడుగుజాడల్లో నడుద్దాం : ఎస్పీ

నిర్మల్ పట్టణం: శాంతి, అహింసామార్గం సూచించిన గాంధీజీ అడుగుజాడల్లో అందరం పయనిద్దామని జిల్లా పోలీసు అధికారి డా.జి.జానకి షర్మిల అన్నారు. జిల్లా పోలీసు క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

సత్ప్రవర్తన అలవర్చుకోవాలి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నిర్మల్ పట్టణం: వివిధ కారణాలతో జైలు జీవితం గడుపుతున్న ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని, సమాజానికి ఉపయోగపడేరీతిలో మార్పుచెందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.కర్ణకుమార్ అన్నారు. ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రత్యేక ఉప కారాగారంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఖైదీలకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్ సివిల్ జడ్జి రాధిక, కారాగార పర్యవేక్షకుడు చిరంజీవి, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు కె.రాజలింగం, లింగాగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇక డిజిటల్ కార్డులు

- నేటి నుంచి జిల్లాలోని పైలెట్ ప్రాజెక్టు ప్రాంతాల్లో సర్వే

నిర్మల్, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డు జారీ చేయడానికి పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో మూడు గ్రామాలు, మూడు పట్టణాల్లోని మూడు వార్డులను ఎంపిక చేశారు. కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయడంతోపాటు మార్పులు, చేర్పులు చేయనున్నారు. కుటుంబ సభ్యులందరూ సమ్మతిస్తేనే కుటుంబ ఫొటో తీసుకుంటారు. ఈ సర్వే గురువారం నుంచి అయిదు రోజులపాటు నిర్వహించనున్నారు. ఒక్కో రోజు 40 నుంచి 60 కుటుంబాల సర్వే చేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఒక్కోదాంట్లో ముగ్గురు నుంచి అయిదుగురు ఉద్యోగులు కుటుంబ సర్వే చేయనున్నారు. సర్వే చేయాల్సిన తీరుపై బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులకు కలెక్టర్ అభిలాష అభినవ్ అవగాహన కల్పించారు. సర్వే చేసే సమయంలో నమోదు చేసే వివరాలు, గుర్తింపు నెంబరు కేటాయింపు, ఇతరత్రా విషయాలను వివరించారు

అన్ని వివరాలు నమోదు

ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రకరకాల గుర్తింపుకార్డులు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డు ఇలా అన్నింటినీ కలిపి డిజిటల్ కార్డు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామం, పట్టణాల్లో ఒక వార్డు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లోని కుటుంబ వివరాలను సర్వే బృందాలు నమోదు చేస్తాయి. రేషన్‌కార్డు, పింఛన్లు, స్వయం సహాయక సంఘాలు, రైతు భరోసా, రైతుబీమా, రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, కంటి వెలుగు, తదితర వివరాల డేటా ప్రభుత్వం వద్ద ఉన్నందున ఇవి సరైనవిగా ఉన్నాయో లేదో నిర్ధారించుకుంటారు. ఆ కుటుంబంలో ఎవరైనా చనిపోతే వారి పేర్లు తొలగించి కొత్తవారివి నమోదు చేస్తారు. ఒక కుటుంబానికి సంబంధించి అన్ని వివరాలు నమోదు చేసిన తర్వాత డిజిటల్ కార్డు జారీ చేస్తారు.

నియోజకవర్గం	గ్రామం/మండలం	కుటుంబాలు	పట్టణం	(వార్డు, ప్రాంతాలు)	కుటుంబాలు
నిర్మల్	డ్యాంగాపూర్, నిర్మల్	251	నిర్మల్	42 చింతకుంటవాడ, పాతబస్టాండ్ పింజారిగుట్ట	534
భైంసా	హస్గుల్, భైంసా	350	భైంసా	24 ఖాజీగల్లి, కోర్బాగల్లి, షకీల్‌గల్లీ	350
ఖానాపూర్	కొత్తపేట, ఖానాపూర్	280	ఖానాపూర్	07 పద్మావతినగర్, ఏకలవ్యకాలనీ బుడగ జంగాలవీధి,	350

ముగ్గురు నోడల్ అధికారులు

డిజిటల్ కార్డు సర్వే పర్యవేక్షణకు జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో నోడల్ అధికారిని నియమించారు. నిర్మల్‌కు ఆర్డీవో రత్నకల్యాణి, ముథోల్‌కు ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఖానాపూర్‌కు జడ్పీ సీఈవో గోవింద్ ఉన్నారు. వీరు అయిదు రోజులపాటు నిర్వహించనున్న సర్వేను పరిశీలించడంతోపాటు బృందాల్లోని సభ్యులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తారు. సర్వే పూర్తయిన తర్వాత నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నారు.

పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్

నిర్మల్, న్యూస్‌టుడే: జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుల కింద ఎంపిక చేసిన గ్రామాలు, పట్టణాల్లోని వార్డుల్లో గురువారం నుంచి నిర్వహించనున్న డిజిటల్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఈ సర్వేపై బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. సర్వేలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరికీ డిజిటల్ నెంబరు కేటాయించడంతోపాటు కుటుంబానికి కలిసి ఒక నెంబరు ఇస్తారని చెప్పారు. ఇంటిలోని పెద్ద వయస్సున్న మహిళను యజమానిగా గుర్తించాలని సూచించారు. ఈ సర్వేను అయిదు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామం, పట్టణాల్లోని ఒక వార్డును పైలెట్ ప్రాజెక్టుగా సర్వే చేపట్టాలన్నారు. డిజిటల్ సర్వేపై ఏరోజుకారోజు నివేదికలు అందజేయాలని సూచించారు. అదనపు పాలనాధికారులు కిషోర్‌కుమార్, ఫైజాన్ అహ్మద్, డీఆర్వో భుజంగరావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రథమచికిత్స అందించి.. ప్రాణాలు నిలబెట్టి..

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: అసలే అర్ధరాత్రి.. పైగా రహదారి పక్కన అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. ఎవరూ గమనించే పరిస్థితి లేదు. ఏమాత్రం ఆలస్యమైనా ప్రాణం పోయేది. గస్తీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది అతడిని చూసి ప్రాణాలు కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. మూర్ఛవ్యాధితో బాధపడుతున్న ఓ యువకుడు మంగళవారం అర్ధరాత్రి దాటాక పట్టణంలోని తిరుమల లాడ్జి సమీపంలో మూర్ఛకు గురై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఆ మార్గంలో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది రాఠోడ్ అనిల్, సురేందర్ అతడిని గమనించారు. వెంటనే ప్రథమ చికిత్స అందించారు. అంబులెన్సుకు సమాచారం అందించి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉంది. సకాలంలో స్పందించి యువకుడి ప్రాణాలు కాపాడిన సిబ్బందిని స్థానికులు అభినందించారు.

ఆటా పాటా.. వేడుకల బాట

- సంస్కృతి, సంప్రదాయాలపై వైద్యవిద్యార్థుల కార్యక్రమాలు

మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే

ప్రభుత్వ వైద్యకళాశాల మంచిర్యాల.. భారాస ప్రభుత్వం తొలి విడతగా ఏర్పాటు కళాశాలల్లో ఇది ఒకటి. బహుశా వైద్యవిద్య అభ్యసించే వారికి, వైద్యవృత్తిలో ఉన్నవారికి తప్పితే ఇక్కడి కళాశాల తెలిసింది చాలా తక్కువ మందికే. కానీ మొదటి సంవత్సరంలోనే రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. తొలి ఏడాది పరీక్ష ఫలితాల్లో 98 శాతంతో తొలి స్థానంలో నిలిచింది. రెండేళ్లు(రెండు బ్యాచ్‌లు)పూర్తిచేసుకుని మూడో బ్యాచ్(ఏడాది)కి సిద్ధమవుతోంది. కేవలం చదువుకే పరిమితం కాకుండా.. నిత్యం పుస్తకాలతోనే కుస్తీ పట్టి ఒత్తిడికి గురికాకుండా ఆటాపాటలతో ఉపశమనం పొందుతున్నారు ఇక్కడి విద్యార్థులు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, భక్తిబాటలో నడుస్తూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు ఎక్కడెక్కడి నుంచో వచ్చామనే భావన రాకుండా.. ఇంటికి దూరంగా ఉంటున్నామనే ఆలోచన దరిచేరకుండా కుటుంబసభ్యుల మాదిరిగా కలిసిమెలిసి వేడుకలు నిర్వహిస్తున్నారు. బోధకులను సైతం భాగస్వాములను చేస్తూ జిల్లా కేంద్రంలో సందడి వాతావరణాన్ని తీసుకొస్తున్నారు.



స్వాగతోత్సవంలో..



వైద్యవిద్యలో భాగంగా జిల్లా కేంద్రంలో శిబిరంలో పాల్గొంటూ..



కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహ మండపం వద్ద విద్యార్థులు

ప్రతి ఉత్సవం.. కలిసికట్టుగా..

రెండు బ్యాచ్‌లు.. రెండు వందల మంది విద్యార్థులతో కళాశాల నిండుగా కనిపిస్తుంది. మొదటి ఏడాది విద్యార్థులు సీనియర్లుగా మారిపోయారు. రెండో ఏటా చేరిన వారు సైతం త్వరలో సీనియర్లు కానున్నారు. ఏటా వేడుకలను కలిసికట్టుగా నిర్వహిస్తున్నారు. మొదటి ఏడాది నుంచే క్రీడాదినోత్సవం, హోలీ, బ్యాచ్ పార్టీ, ఇఫ్తార్ విందు, పరీక్షల ఫలితాల అనంతరం వైభవోపేతంగా సరస్వతిపూజ, స్వాగతోత్సవం, ఆచార్యుల పదవీ విరమణ వేడుకలు, ఉపాధ్యాయ దినోత్సవం, ఇటీవల ఆధ్యాత్మిక వేడుకైన వినాయక విగ్రహ ఏర్పాటు ప్రత్యేక పూజలు, రోజుకో తీరు ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఇలా ప్రతి వేడుకను ఓ పద్ధతిగా, చూడముచ్చటగా జరిపిస్తున్నారు. కళాశాలలో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంచుతున్నారు.

ప్రభుత్వ వైద్యకళాశాల అనుమతి వచ్చింది.. సొంత భవనం లేదు. వసతి గృహాలు అందుబాటులోకి రాలేదు. అయినా 98 శాతం ఉత్తీర్ణతతో తొలి ఏడాదే రాష్ట్రం మొత్తం మంచిర్యాల వైపు చూసేలా చేశారు. 24 గంటలు పుస్తకాలకే పరిమితం కాలేదు.. ఆటపాటలకు దూరంగా అసలే లేరు. పేరుపొందిన వైద్య కళాశాలల మాదిరిగా ఇక్కడా అన్ని కార్యక్రమాలు నిర్వహించారు. మంచిర్యాల వైద్య కళాశాలను ఔరా అనిపించేలా చేశారు.



కార్మికుల సేవలు ప్రశంసనీయం

నిర్మల్ పట్టణం: ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య నిర్వహణ కీలకమని తపాలా శాఖ నిర్మల్ ఉపవిభాగం ఇన్‌స్పెక్టర్ జి.సందీప్‌కుమార్ అన్నారు. స్థానిక తపాలాశాఖ కార్యాలయంలో స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పలువురు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. పోస్టుమాస్టర్ కదం వెంకట్‌రావు, సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలి: ముథోల్ ఎమ్మెల్యే



భైంసా మండలం ఇలేగాంలో చీపురు పట్టిన ఎమ్మెల్యే రామారావు పటేల్, తదితరులు

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం ద్వారా పరిశుభ్రతతో పాటు, రోగాల వ్యాప్తిని అరికట్ట వచ్చని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. మండలంలోని ఇలేగాంలో బుధవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడానికి ఇలేగాం గ్రామపంచాయితీలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం పంచాయతీ కార్మికులను సన్మానించారు. డీఎల్పీవో సుదర్శన్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అబ్దుల్‌రజాక్, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడు శ్రీనివాస్, కార్యదర్శి వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

స్ఫూర్తిదాయకం 'కిషోర గాంధీయం' పుస్తకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత, సాహితీవేత్తలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: విశ్రాంత ఎంపీడీవో చట్ల గజ్జారాం రచించిన 'కిషోర గాంధీయం' ఖండకావ్యం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని వక్తలు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నిర్మల్‌లో పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి కవితకు వివరణ ఇవ్వడం బాగుందని కొనియాడారు. డా.అప్పాల చక్రధారి, రచయిత చట్ల గజ్జారాం, డా.దామెర రాములు, సురశేఖర్, డా.ఉప్పు కృష్ణంరాజు, తొడిశెట్టి పరమేశ్వర్, బొందిడి పురుషోత్తమరావు, మునిమడుగుల రాజారావు, నేరెళ్ల హన్మంతు, డా.మురళీధర్, జగదీశ్వర్, అంబటి నారాయణ, పత్తి శివప్రసాద్, పోలీస్ భీమేశ్, నాగోరావు, బిక్షపతి, చంద్రమోహన్‌రెడ్డి, చెనిగారపు నాగరాజు, నవీద్ నురాని తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి

జిల్లా వ్యాప్తంగా బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడక్కడ లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను కూడా జరిపారు. - న్యూస్‌టుడే బృందం



నిర్మల్ : గాంధీపార్కులోని బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ మంత్రి ఐకే రెడ్డి, 'పుర' ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్



నిర్మల్ : కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, కాంగ్రెస్ నాయకులు..



మామడ: పొన్కల్‌లో ..



సారంగాపూర్ మండలం ఆలూర్‌లో..



కుంటాలలో డీపీఓ శ్రీనివాస్, అధికారులు



ఖానాపూర్‌లో పురపాలక సంఘం ఛైర్మన్ సత్యం, అధికారులు, నాయకులు



భైంసాలో భాజపా నాయకులు..



భైంసా పట్టణంలో కాంగ్రెస్ నాయకులు..



లోకేశ్వరం ఎంపీడీఓ కార్యాలయంలో..



పెంబిలో..



నర్సాపూర్(జి)లో



దిలావర్‌పూర్‌లో ..



ఆర్జీయూకేటీలో ఉపకులపతి వెంకటరమణ, అధ్యాపకులు..



లక్ష్మణచాంద: పొట్టపెల్లి(కె)లో..

మహాత్ముడి కలలు సాకారానికి శ్రమిద్దాం

కడెం, న్యూస్‌టుడే: మానవ మనుగడకు ముప్పుగా మారుతున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టేందుకు అందరూ కంకణబద్ధులు కావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కోరారు. బుధవారం కడెం(పెద్దూరు) పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మహాత్ముడి కలల సాకారానికి అందరం శ్రమించాలని కోరారు. ప్లాస్టిక్ వల్ల ఎన్ని అనర్థాలు ఉన్నాయో అందరికీ తెలిసీ తప్పు చేస్తున్నామని పేర్కొన్నారు. గతంలోలా శుభకార్యాల్లో స్టీల్ వస్తువులు వాడాలని పిలుపునిచ్చారు. అందుకు ప్రతి పంచాయతీలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటుచేయాలన్నారు. కడెం పంచాయతీలో ఏర్పాటుచేసిన స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించారు. పారిశుద్ధ్య సిబ్బందిని, కార్యదర్శిని సత్కరించారు. డీఆర్డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ అరుణ, ఎంపీఓ కవిరాజ్, కాంగ్రెస్ నాయకులు సతీష్‌రెడ్డి, శంకర్, మల్లేష్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.



కడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

వదంతులు నమ్మొద్దు: ఎస్పీ

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: కుభీరు ఘటనపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. భైంసా పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుభీరు మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు, అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను భైంసా పట్టణానికి తీసుకురావడంతో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న ఎస్పీ వెంటనే పట్టణానికి చేరుకుని పూర్తి వివరాలను సేకరించారు. యువకుడు, బాలిక సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. ఈ విషయమై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వీడియోలను పోస్టు చేసినా, వదంతులు వ్యాప్తి చేసినా చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు గుంపులుగా ఉండొవద్దని తెలిపారు. పట్టణ సీఐ గోపీనాథ్ పాల్గొన్నారు.

స్టీల్ బ్యాంకులు ప్రారంభం

కుంటాల, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వాడకంతో అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఓలాలో బుధవారం పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసుల వాడకాన్ని తగ్గించేందుకు గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించారు.

దస్తూరాబాద్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో రమేష్ అన్నారు. 'స్వచ్ఛతాహీ సేవా' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో గ్రామసభ నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన 'స్టీల్ బ్యాంక్' ను ప్రారంభించారు. ఎంపీవో రమేష్‌రెడ్డి, ఏపీవో రవిప్రసాద్, నాయకులున్నారు.

సోన్: మండల కేంద్రంతోపాటు న్యూవెల్మల్, గంజాల్‌లో బుధవారం ఎంపీడీఓ సురేష్ స్టీల్ బ్యాంకులను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఏదేని కార్యక్రమం ఉంటే వీటిని ఉచితంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎంపీఓ షేక్ ఖలీల్ హైమద్, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మణ్, భూపాల్‌రెడ్డి, రాణి పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: పర్యావరణ పరిరక్షణకు స్టీల్ పాత్రలను వాడి మండలాన్ని ప్లాస్టిక్‌రహితంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని మండల ప్రత్యేకాధికారి జాదవ్ అంబాజీ కోరారు. బాబాపూర్, నర్సాపూర్(డబ్ల్యూ), పార్‌పెల్లి గ్రామాల్లో స్టీల్ బ్యాంక్‌లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్‌ఖాన్, ఏపీవో ప్రమీల పాల్గొన్నారు.

నర్సాపూర్ (జి): గొల్లమాడ గ్రామంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి స్టీల్‌బ్యాంక్ ప్రారంభించారు.

ఖానాపూర్ గ్రామీణం: మండలంలోని సింగాపూర్, అడవిసారంగాపూర్‌తో పాటు వివిధ గ్రామాలలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్ బ్యాంకులను ప్రారంభించారు.

పల్లెల అభివృద్ధికి భాగస్వాములు కావాలి

దిలావర్‌పూర్: పల్లెల అభివృద్ధికి గ్రామస్థులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో అరుణకుమారి అన్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభ నిర్వహించి మాట్లాడారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఉపాధిహామీ పనుల గుర్తింపునకు స్థానికుల సలహాలు అడిగి తెలుసుకున్నారు. కాల్వ, సాంగ్వీ, బన్సపల్లి గ్రామాల్లో స్టీలు బ్యాంకులు ప్రారంభించారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



భైంసాలో లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా గ్రామీణం: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఏఎంసీ మాజీ అధ్యక్షుడు ఆనంద్‌రావు పటేల్, నాయకులు తోటరాములు, ఫరూక్ అహ్మద్, అంజాద్‌ఖాన్ పాల్గొన్నారు.

నారసింహుని సన్నిధిలో జడ్జి పూజలు

ధర్మపురి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో బుధవారం నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సీనియర్ అసిస్టెంటు అల్వాల శ్రీనివాస్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని జడ్జికి అందజేశారు.

నేటి నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం

లక్ష్మణచాంద: దసరాను పురస్కరించుకుని లక్ష్మణచాంద అష్టభుజవేణు గోపాలస్వామి ఆలయం శరన్నవరాత్రులకు ముస్తాబైంది. ఏటా దసరా ఉత్సవాలను ఇక్కడ వైభవంగా నిర్వహించటం ఆనవాయితీ. గ్రామ, ఆలయాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలతో పాటు, నిత్యం రథోత్సవం నిర్వహిస్తారు.

అఖండజ్యోతితో మహారాష్ట్ర వాసుల పాదయాత్ర

ముథోల్: మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బోకర్ తాలూకా ఉమర్‌ఖేడ్ గ్రామ యువకులు బుధవారం బాసరకు పాదయాత్రగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం ఉమర్‌ఖేడ్ గ్రామంలో దుర్గామాతను ప్రతిష్ఠించేందుకు బాసర నుంచి అఖండ జ్యోతిని వెలిగించుకొని పాదయాత్రగా వెళ్లారు.

కొండాపూర్‌లో అయ్యప్పస్వామి పల్లకి సేవ

నిర్మల్ గ్రామీణం: అయ్యప్పస్వామి ఉత్తర నక్షత్ర జన్మతిథి పురస్కరించుకొని పడిపూజ మంగళవారం రాత్రి కొండాపూర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. వేదపడింతులు సంజయ్ శర్మ, మాలధారణ స్వాముల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. గురుస్వామి మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్ భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.



వానల్‌పాడ్ పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయాలని ఎంపీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఈ కార్యదర్శి మా కొద్దు.. గ్రామస్థుల నిరసన

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సహా ఏ ఒక్క కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించని గ్రామ కార్యదర్శి తమకు వద్దని, వెంటనే ఆమెను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని గ్రామస్థులు నిరసన తెలిపిన ఘటన భైంసా మండలం వానల్‌పాడ్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. దేశమంతా గాంధీజీ జయంతిని వేడుకగా జరుపుతుంటే వానల్‌పాడ్‌లో అలక్ష్యం చేయడాన్ని తప్పుపడుతూ మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పంచాయతీ కార్యాలయానికి చేరుకుని కార్యదర్శి గాయత్రిని ప్రశ్నించారు. ఎంపీఓ మోహజం హుస్సేన్‌కు విషయం ఫోన్‌లో తెలపడంతో ఆయన గ్రామానికి వచ్చారు. కార్యదర్శి, కారోబారిని మందలించి గ్రామస్థులకు సర్దిచెప్పి గాంధీజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈక్రమంలో గ్రామస్థులు కార్యదర్శి పనితీరుపై ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. విధులకు సక్రమంగా కారని, ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, సంతకం చేయకుండా ఇంటి పన్ను రసీదు ఇస్తున్నారని, దురుసుగా ప్రవర్తిస్తారని, అమర్యాదగా సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు. ఆమెను బదిలీ చేయాలని ఎంపీఓకు వినతిపత్రం అందజేశారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: సైబర్ మోసాలు ఎక్కువవుతున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.వి.రమణారావు కోరారు. స్థానిక ప్రయాణప్రాంగణంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సులభ సంపాదన, ప్రలోభాలకు ఆశపడి ఆన్‌లైన్ మోసగాళ్ల చేతిలో పడొద్దని, అనవసరంగా డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. ఎవరైనా మోసానికి గురైతే వెంటనే సైబర్‌క్రైమ్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. ప్రతినెలా మొదటి బుధవారం సైబర్ జాగరూకతా దివస్ నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సై రాజేశ్వర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

దస్తూరాబాద్: సైబర్ నేరాలకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శంకర్ సూచించారు. బుధవారం మండలంలోని భూత్కూర్‌లో యువత, గ్రామస్థులతో కలిసి ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

దస్తూరాబాద్: ఈ నెల 6న ఖానాపూర్ సీఎంఆర్ గార్డెన్‌లో జీఎంఆర్ కంపెనీ నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై శంకర్ కోరారు. నిరుద్యోగులు మేళాకు హాజరుకావాలని కోరారు.

భైంసా గ్రామీణం: అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భైంసా గ్రామీణ ఎస్సై జి.శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండలంలోని మాటేగాం టోల్‌ప్లాజా వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితులను ప్రశ్నించి ప్రయాణ వివరాలను తెలుసుకున్నారు. ద్విచక్రవాహన చోదకులు శిరస్త్రాణం ధరించాలని అవగాహన కల్పించారు.

నేర వార్తలు

నీట మునిగి తాపీ మేస్త్రీ మృతి



వంగదారి అద్రత్

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా బాసర గోదావరి నదిలో స్నానం చేస్తూ నీట మునిగి మేస్త్రీ వంగదారి అద్రత్(45) ప్రాణాలు కోల్పోయినట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా లింగసముద్రం మండల కేంద్రానికి చెందిన అద్రత్ కొన్నేళ్లుగా బాసరలో ఓ వ్యక్తి దగ్గర తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి పని ముగిసిన తర్వాత ఇతర మేస్త్రీలతో కలిసి గోదావరిలో స్నానానికి వెళ్లాడు. మిగతావారు మొదటి ఘాట్ వద్ద మెట్లపై స్నానం చేస్తుంటే అద్రత్ లోపలికి వెళ్లి ఈత కొడుతూ ఒక్కసారిగా మునిగిపోయాడు. గమనించిన తోటి మేస్త్రీలు అక్కడ ఉన్న వారికి చెప్పి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. రాత్రి బాసర పోలీసులకు సమాచారం అందించారు. ఉదయం ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో వెదికించి శవాన్ని బయటకి తీయించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

ముథోల్(బాసర): నిజామాబాద్ జిల్లా నవీపేట మండల కేంద్రానికి చెందిన దత్తు (45) బాసర గోదావరినదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా.. దత్తు కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. ఆరునెలల కిందట ఆయన యాసిడ్ తాగాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది 15 రోజుల క్రితం ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు వెదికినా ఆచూకీ లభించలేదు. బుధవారం మధ్యాహ్నం గోదావరి నదిలో స్నానం చేస్తున్న భక్తులకు మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న ఎస్సై దాన్ని బయటకు తీయించారు. అక్కడ లభించిన ఆధార్‌కార్డు ప్రకారం మృతుడు దత్తుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

మనస్తాపంతో ఒకరు..

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి ఓ వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మణచాంద గ్రామానికి చెందిన ఇట్టం రాములు(49) కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. గతంలో తల్లి, సంవత్సరం క్రితం భార్య అనారోగ్యంతో మరణించారు. భార్య లేదని మనస్తాపం చెందిన రాములు మంగళవారం సాయంత్రం పురుగు మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్‌కు తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మరణించారు. రాములుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మద్యానికి బానిసై వృద్ధుడి..

లోకేశ్వరం: మద్యానికి బానిసగా మారిన ఓ వృద్ధుడు ఇంట్లో డబ్బులు ఇవ్వకపోవడంతో చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని గడ్‌చంద గ్రామంలో చోటు చేసుకుంది. లోకేశ్వరం ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓలపు ముత్యం(60) మద్యానికి అలవాటు పడ్డారు. ఇంట్లో మద్యానికి డబ్బులు ఇవ్వని సమయంలో కుటుంబ సభ్యులతో గొడవపడేవారు. మంగళవారం ఉదయం భార్యను డబ్బులు అడగగా ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయారు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో ఉదయం ఆయన కోసం వెదుకుతుండగా గడ్‌చంద శివారులోని గోవింద్ చెరువులో శవమై తేలారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

వృద్ధురాలి మెడలోని గొలుసు అపహరణ



బాధితురాలు గంగాదేవి



ద్విచక్రవాహనంపై వెళ్తున్న అనుమానితులు (సీసీ ఫుటేజీ చిత్రం)

భైంసా గ్రామీణం: ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లిన ఘటన బుధవారం భైంసా పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితురాలు తెలిపిన వివరాలిలా.. పులేనగర్‌కు చెందిన గంగాదేవి (65) రాహుల్‌నగర్ ప్రధాన రహదారిపై కాలినడక వెళుతున్నారు. ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమెను ఓ చిరునామా అడిగి మాటల్లో దింపి.. ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కున్నారు. ప్రతిఘటించిన బాధితురాలి చేతికి గాయాలయ్యాయి. ఆ ఆభరణం సుమారు 5 తులాలు ఉంటుందని వాపోయింది. దుండగులు ద్విచక్రవాహనంపై వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు పేర్కొంది.

విద్యార్థిని అదృశ్యం

ఆదిలాబాద్ నేర విభాగం: ఆదిలాబాద్ రిమ్స్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ శిక్షణ పొందుతున్న విద్యార్థిని(20) అదృశ్యమైనట్లు మావల పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మావల ఎస్ఐ విష్ణువర్ధన్ వివరాల మేరకు.. నిర్మల్ జిల్లాకు చెందిన ఆమె చరవాణి మంగళవారం ఉదయం నుంచి స్విచ్ఛాఫ్ అయింది. సోదరుడు పలుమార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోవటంతో బుధవారం కళాశాలకు వచ్చి వాకబు చేయగా జాడ తెలియరాలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

సంక్షిప్త సమాచారం


భాజపా నాయకుల శ్రమదానం

కుంటాల: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సేవా పక్షం కార్యక్రమంలో భాగంగా కల్లూరులో భాజపా నాయకులు బుధవారం శ్రమదానం చేశారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాజపా మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య, జిల్లా కోశాధికారి సౌధరి లక్ష్మణ్‌పటేల్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ప్రదేశాల్లో చెత్తను పారేయొద్దు

సారంగాపూర్: ఆవాసాల పక్కన, వీధుల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో చెత్తను పారేయొద్దని ఎంపీఈవో అజీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని తాండ్ర(జి)లో చెత్త సేకరణ కోసం లోహపు చెత్త బుట్టలను ఆయన పంపిణీ చేశారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తలను బుట్టల్లో వేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సాక్‌పెల్లి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి



కుంటాల: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటు నమోదు చేసుకోవాలని నియోజకవర్గ భాజపా సహ ఇన్‌ఛార్జి జక్కుల గజేందర్ అన్నారు. కుంటాలలోని పలు పాఠశాలల్లో పట్టభద్రులను కలిసి ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. వంద శాతం ఓటింగ్ నమోదు దిశగా పట్టభద్రులు కృషి చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

అన్నదానానికి ప్రత్యేక స్థానం

నిర్మల్ పట్టణం: సనాతన హిందూధర్మంలో అన్నదానానికి ప్రత్యేక స్థానం ఉందని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి నాయకులు అన్నారు. స్థానిక మినీట్యాంక్‌బండ్ వద్ద ఉన్న నాగమ్మ ఆలయ ప్రాంగణంలో బుధవారం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాచకులు, అన్నార్తుల ఆకలి తీర్చడం సంతృప్తినిచ్చే విషయమన్నారు. అమావాస్య, పౌర్ణమి తిథుల్లో అన్నదానం చేయడం పితృదేవతలను స్మరించడం లాంటిదన్నారు. కార్యక్రమంలో డా.ఉప్పు కృష్ణంరాజు, కోటగిరి గోపి, నాంపల్లి హరివర్మ, కందుల శేఖర్, మంచిర్యాల శ్రావణ్‌కుమార్, బెజ్జంకి బ్రహ్మేందర్ పాల్గొన్నారు.

నేడు బతుకమ్మ వేడుకలు

భైంసా గ్రామీణం: భైంసా మున్నూరు కాపు మిత్ర మండలి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. పోలీసు బందోబస్తు, గడ్డెన్న జలాశయం వద్ద సౌకర్యాలు కల్పించాలని కోరుతూ బుధవారం ఏఎస్పీ అవినాష్ కుమార్, పురపాలక కమిషనర్ రాజేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కార్యవర్గం ఎన్నిక

పెంబి: పీఆర్‌టీయూ తెలంగాణ పెంబి మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా తాను ఎన్నికైనట్లు బామండ్ల శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా భూక్య సుభాష్, ఉపాధ్యక్షులుగా బి.స్వరాజ్, జి.రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. సంఘం జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న, ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్ తదితరులు ఎన్నికల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

రేపు పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

నిర్మల్ అర్బన్: పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్మల్‌లోని రెడ్డి ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న తెలిపారు.

దుర్గంధం భరించలేం

నిర్మల్: నిర్మల్‌లోని ఈద్గాం ప్రాంతంలో ఉన్న చేపల మార్కెట్ పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. చేపల విక్రయం అనంతరం వ్యర్థాలను అక్కడే వదిలేయడం, ప్రక్కనే ఉన్న కందకంలో విసిరేయడం వల్ల అక్కడి పరిసరాలన్నీ కంపుకొడుతున్నాయి. అక్కడున్న దుకాణాదారులతో పాటు దారిన పోయేవారు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులుపరిసరాలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

ఆర్జీయూకేటీలో ఫలహారశాలల ఏర్పాటు: ఉపకులపతి



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణ

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: విద్యార్థుల వినతుల మేరకు ఆర్జీయూకేటీలోని భోజనశాలలకు నూతనంగా టెండర్లను ఆహ్వానిస్తున్నామని, నాలుగు ఫుడ్‌కోర్టు(ఫలహారశాల)లను సైతం ఏర్పాటు చేయిస్తున్నామని ఇన్‌ఛార్జి ఉపకులపతి వెంకటరమణ తెలిపారు. బాసర ఆర్జీయూకేటీలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్జీయూకేటీ ఏర్పాటైనప్పటి నుంచి చేసిన పనులు, విద్యార్థులు సాధించిన ఘనతలతో కూడిన పుస్తకాన్ని విడుదల చేశారు. విద్యార్థుల కోసం 100 డెస్క్‌టాప్ బెంచీలు, విద్యార్థులు, విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు చేశామని, త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. ప్రధాన ద్వారం వద్ద తల్లిదండ్రులు వేచి ఉండటానికి తలపెట్టిన షెడ్డు త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో పలువురు బోధన సిబ్బంది రాజీనామా చేసి వెళ్లారని, వారి స్థానంలో తాత్కాలిక అతిథి అధ్యాపకులను నియమిస్తామని చెప్పారు. విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని, వాటిని దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ప్రతిభావంతులను సెంటిపెడ్ కంపెనీ ఉద్యోగాలకు ఎంపిక చేసి వారికి నెలకు రూ.50 వేల ఉపకారవేతనం ఇస్తూ శిక్షణ ఇస్తోందని చెప్పారు. పరిపాలన విభాగం అధికారి రణధీర్, ఆయా విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చేతులు కలిపారు.. బడిని బతికించారు

న్యూస్‌టుడే, ఇచ్చోడ, బజార్‌హత్నూర్ :

గ్రామస్థుల తోడ్పాటు, తల్లిదండ్రుల అండ, గ్రామ ఉద్యోగుల సహకారం వెరసి ఆ ప్రభుత్వ బడి నేడు సమస్యలు లేని ఆదర్శ బడిగా రూపుదిద్దుకుంది. అదే బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల.

బజార్‌హత్నూర్ మండలం పిప్పిరిలో గతేడాది 50 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసించేవారు. పిల్లల సంఖ్య తగ్గడంతో గ్రామాభివృద్ధి కమిటీతో పాటు పిల్లల తల్లిదండ్రులు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇద్దరే ఉండటం కారణంగా కనిపించింది. సమస్యను పరిష్కరించేందుకు వీడీసీ ఆధ్వర్యంలో ఒక వాలంటీరును నియమించారు. అతడికి నెలకు రూ. 7,500 పారితోషికం అందించారు. ఈ ఏడాది పాఠశాల ప్రారంభంలోనే పిల్లల పోషకులు, వీడీసీ, గ్రామ ఉద్యోగులతో పాటు విశ్రాంత ఉద్యోగులు సమావేశమయ్యారు. పాఠశాలలోని సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం దిశగా అడుగులు వేశారు.


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న గ్రామస్థులు నియమించిన విద్యా వాలంటీరు


పిప్పిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ఇలా ముందుకు సాగుతున్నారు

పాఠశాల ప్రారంభంలోనే గ్రామస్థులంతా సమావేశమయ్యారు. ఇద్దరే ఉపాధ్యాయులు ఉండటంతో అప్పటికే కొనసాగుతున్న వీవీతో పాటు పోషకులు తమ సొంత ఖర్చులతో మరో వీవీని నియమిస్తామని ముందుకొచ్చారు. ఇందుకు ఒక కమిటీని నియమించుకున్నారు. ప్రతి నెల అతడికి రూ. 6 వేల పారితోషికం అందిస్తున్నారు. దాతల సహాయంతో కుర్చీలను అందించారు. రూ. 40 వేలు ఖర్చు చేసి రెండు గేట్లను ఏర్పాటు చేశారు. రూ. 10 వేల ఖర్చుతో బీరువా కొన్నారు. రూ. 10 వేలతో ఐడీ కార్డులు అందించారు. ఓ స్వచ్ఛంద సంస్థ తోడ్పాటుతో 70 బ్యాగులు అందించారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 67కి చేరింది. ఇటీవల ఒక ఉపాధ్యాయుడు రావడంతో ముగ్గురు ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ఇద్దరు వాలంటీర్లు అక్కడ పని చేస్తున్నారు. బడి తోటతో పాటు పరుచుకున్న పచ్చదనం పాఠశాలకు ఎంతో అందాన్నిస్తుంది.

చాలా సంతోషంగా ఉంది

\- సురేందర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు



పాఠశాల అభివృద్ధికి పిల్లల పోషకులు, వీడీసీ సంఘం సభ్యులు, ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వ తోడ్పాటుతో పాటు గ్రామస్థుల సహకారంతో పాఠశాలను తీర్చిదిద్దుకుంటున్నాం.

ఇక్కడే చదివిస్తాం

\- రాజేందర్, పోషకుడు



ప్రైవేటులో వేలల్లో ఫీజులు కట్టి చదివించే స్తోమత లేదు. పాఠశాలలో సమస్యలు తీర్చేందుకు వీడీసీతో పాటు దాతలు ముందుకొస్తున్నారు. మేము కూడా కొంత మా పిల్లల కోసం ఖర్చు చేస్తున్నాం. నాణ్యమైన విద్య ఇక్కడే దొరుకుతోంది.

ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య

\- భోజారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు పిప్పిరి



ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య అందుతుంది. మా సంఘ సభ్యులంతా కలిసి చిన్నపాటి సమస్యలను పరిష్కరించుకొని బడిని బాగు చేసుకుంటున్నాం. పిల్లలను పోషకులు ప్రభుత్వ బడికి పంపడమే మా కోరిక.

దుమ్ము దులిపేస్తోంది..!

● సింగరేణిలో వాయు కాలుష్య నియంత్రణ యంత్రం ప్రారంభం



సింగరేణి అంటే బొగ్గు గనులతో కూడిన ప్రాంతం. నిత్యం బొగ్గు లారీలు, పెద్ద వాహనాల రాకపోకలతో రోడ్ల వెంబడి దుమ్ము, ధూళి విపరీతంగా వ్యాపిస్తుంటుంది. వాయు కాలుష్యానికి కారణమవుతుంది. యాజమాన్యం ఏటా లక్షల కొద్దీ మొక్కలు పెంచుతూ కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నా.. మరింత నియంత్రణకు ఆధునిక సాంకేతికతో కూడిన ఓ యంత్రాన్ని కొనుగోలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆరు జిల్లాలో గనులు విస్తరించి ఉండగా.. బెల్లంపల్లి ఏరియాలో మొదటగా ఈ యంత్రాన్ని ప్రవేశపెట్టింది.

ఎలా పనిచేస్తుందంటే..

బొగ్గు గనుల ప్రాంతంలో వాయు కాలుష్య నియంత్రణ, కార్మిక సంక్షేమానికి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. రోడ్లపై దుమ్ము, ధూళిని నియంత్రించేందుకు కదిలే వాయు కాలుష్య (ఫాగ్ కెనాన్) యంత్రాన్ని బెల్లంపల్లి ఏరియాలో గత నెల 25న ప్రారంభించింది. గనుల ఏర్పాటులో భాగంగా ఈసీ సూచన మేరకు తొలిసారిగా దీన్ని ఏర్పాటు చేశారు. మూడేళ్ల కాలపరిమితితో టెండరు ప్రక్రియ ద్వారా రూ. 1.23 కోట్ల వ్యయం చేశారు. ఒక లారీకి నీటి ట్యాంకర్, 30 కేవీ జనరేటర్‌ను బిగించారు. దిల్లీ నుంచి తీసుకొచ్చిన ఈ యంత్రాన్ని లారీకి వెనుక భాగంలో అమర్చారు. లారీ నడుస్తున్న తరుణంలో దాని నుంచి నీళ్ల తుంపర్లు దూసుకొని వస్తుంటాయి. దీంతో దుమ్ము నివారణతో పాటు గాలిలోని కాలుష్యాన్ని నివారించేందుకు దోహదపడుతుంది.

ఏయే ప్రాంతాల్లో..

ఖైరిగూర ఓసీపీ నుంచి గోలేటి సీహెచ్‌పీ వరకు సింగరేణి రహదారి మీదుగా నిత్యం బొగ్గు లారీల రాకపోకలు కొనసాగుతుంటాయి. ఈ యంత్రాన్ని ఖైరిగూర ఓసీపీ నుంచి గోలేటి టౌన్‌షిప్, దుబ్బగూడెం, భగత్‌సింగ్‌నగర్, రేకులగూడ, గోలేటి క్రాసు రోడ్డు మీదుగా గోలేటి సీహెచ్‌పీ వరకు నిత్యం తిప్పుతుంటారు. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు ఈ యంత్రం ఎంతో దోహదపడుతుందని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ తెలిపారు.

\- న్యూస్‌టుడే, గోలేటి టౌన్‌షిప్

నర్సరీల ఏర్పాటుపై దృష్టి సారించాలి

ఏసీసీ, న్యూస్‌టుడే : జిల్లాలో నర్సరీల్లో మొక్కల పెంపకంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-25 సంవత్సరానికి గానూ నిర్దేశించిన ప్రణాళికను అమలుచేయాలన్నారు. పనులను గుర్తించి అవసరమైన బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి పంచాయతీలో నర్సరీ ఏర్పాటుకు స్థలాన్ని ఈ నెల 5లోగా గుర్తించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్డీవో కిషన్, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జడ్పీ సీఈవో గణపతి పాల్గొన్నారు.

బాలాలయంలోనే.. గంగనీళ్ల ఉత్సవాలు

● శని, ఆదివారాల్లో జాతర

సారంగాపూర్, న్యూస్‌టుడే: వరుసగా రెండో ఏడాది 'గంగనీళ్ల' జాతర ఉత్సవాలు అడెల్లి మహా పోచమ్మ బాలాలయంలోనే జరగనున్నాయి. నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చినా అమ్మవారిని ఆలయంలో ప్రతిష్ఠించనందున నూతన ఆలయం ఇంకా ప్రారంభం కాలేదు. ఈ నెల 5, 6వ తేదీల్లో జాతర జరగనుండగా ఈవో రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. దసరాకు ముందు వచ్చే మహాలయ అమావాస్య తదుపరి శని, ఆదివారాల్లో గంగనీళ్ల జాతర జరపడం ఆనవాయితీ. శనివారం ఉదయం 11 గంటలకు బాలాలయంలో పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలుచేసి, అమ్మవారి ఆభరణాలతో ఆలయ సేవాదారులు శోభాయాత్రగా గోదావరి నదికి పయనమవుతారు. అడెల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్ర సారంగాపూర్, యాకర్‌పల్లి, వంజర్, ప్యారమూర్ మీదుగా దిలావర్‌పూర్ మండలం మాడెగాం, దిలావర్‌పూర్, కంజర్, సాంగ్వి గ్రామాల నుంచి సాయంత్రానికి గోదావరి తీరానికి చేరుతుంది. రాత్రికి అక్కడే జాగరణ చేస్తారు. ఆదివారం వేకువజామున గోదావరి నీటితో ఆభరణాలను శుద్ధి చేసి పాదయాత్రగా తిరిగి అదే మార్గంలో సాయంత్రానికి పోచమ్మ ఆలయానికి చేరుకుంటారు. తీసుకొచ్చిన జలాలను స్థానిక కోనేటి నీటితో కలిపి అమ్మవారికి అభిషేకం చేసి ఆభరణాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం భక్తులు దర్శించుకోవడంతో జాతర ముగుస్తుంది.


బాలాలయంలో పోచమ్మ తల్లి

ఏర్పాట్లు పూర్తి:

జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేశాం. ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తయినా మందిరం ప్రారంభం కాకపోవడంతో బాలాలయంలోనే జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. భక్తులకు తాగునీరు, ఇతర వసతులు కల్పించాం. నిర్మల్, భైంసా డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు సైతం నడపాలని విజ్ఞప్తి చేశాం. **-రమేష్, ఆలయ ఈవో**

సామాజిక మాధ్యమాల పోస్టులపై ప్రత్యేక నిఘా

మంచిర్యాలనేరవిభాగం : చట్టవ్యతిరేకమైన పలు పోస్టులను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. మతాన్ని, కులాన్ని ద్వేషించేలా చేస్తున్న పోస్టులపై పోలీసుల నిఘా ఉందని, ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రకృతి ఒడిలో దేవాపూర్!


ఎత్తయిన కొండల దిగువన, చుట్టూ దట్టమైన అడవుల మధ్యలో దేవాపూర్ గ్రామం

అడవుల జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ వర్షాలతో పచ్చదనం సంతరించుకుంది. కొండాకోనల్లో ఎక్కడ చూసినా జలపాతాల గలగలలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. గూడేలు, తండాలే కాదు పెద్ద పంచాయతీలు సైతం పచ్చదనం మాటున దాగి ఉన్నాయి. సాధారణంగా కొండాకోనల్లో దట్టమైన అడవుల్లో అయిదు నుంచి పది ఇళ్లు ఉండే చిన్న తండాలు దూరం నుంచి చూడటానికి అందంగా కనిపిస్తాయి. అక్కడ పూర్తిస్థాయిలో ప్రజలకు సౌకర్యాలు అందుబాటులో ఉండవు. ఇక్కడ మీకు ఎత్తయిన కొండల దిగువన, చుట్టూ దట్టమైన అడవుల మధ్యలో అందంగా కనిపిస్తున్న ఈ గ్రామం తలమడుగు మండలం దేవాపూర్. మండలంలోనే మేజర్ పంచాయతీగా పేరు పొందింది. ఇక్కడ 865 కుటుంబాలు ఉండగా జనాభా 2,955 మంది ఉన్నారు. ఎటు చూసినా పచ్చదనంతో పాటు చల్లని వాతావరణం వీరి సొంతం. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడటంతో పక్కనే ఆదిలాబాద్ పట్టణం సుమారు 9 కిలోమీటర్ల దూరంలో ఉన్నా.. అక్కడ ఉండేందుకు ఇక్కడి ప్రజలు ఇష్టపడరు. **- ఈనాడు, ఆదిలాబాద్ - న్యూస్‌టుడే, తలమడుగు**

నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ముధోల్(బాసర), న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాలకు బాసరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే రామారావు పటేల్ చెప్పారు. బాసర ఆలయంలో బుధవారం పూజలు చేసినంతరం నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. మూల నక్షత్రం రోజున భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. భక్తులు, ప్రముఖులకు వేర్వేరు దర్శనం ఏర్పాట్లు ఉండాలని ఈఓకు సూచించారు. గోదావరి నది ఉద్ధృతి దృష్ట్యా 40 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈఓ విజయరామారావు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వరుసలో మధ్యలో తల్లులు చిన్నారులకు పాలు ఇవ్వడానికి ప్రత్యేక గదులను ఏర్పాటు చేశామన్నారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎస్సై గణేశ్, పంచాయతీ ఈఓ గోవిందరాజులు, ఎంపీఓ గంగాసింగ్, ఆలయ ప్రధాన అర్చకుడు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

చేనేత వస్త్రాల సేకరణ

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని భాజపా కార్యాలయంలో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేనేత వస్త్రాలను సేకరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సత్యం, అహింస, నిస్వార్థసేవ గాంధీజీ ఆదర్శాలని, అవి ఎప్పటికీ అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అయ్యన్నగారి రాజేందర్, నాయకులు రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, ఆడెపు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న భాజపా నాయకులు


బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి

అంబరం.. క్రీడా సంబరం

● ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: క్రికెట్ అంటే అందరూ ఎంతో ఆసక్తి కనబరుస్తుంటారు. ఆ ఆటకు ఉన్న గుర్తింపే వేరు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను చూసి వారిలాగే తామూ ఎదగాలని దానిపై మక్కువ పెంచుకున్న ఎంతో మంది నిత్యం తర్ఫీదు పొందుతుంటారు. వివిధ టోర్నీల్లో ఆడి తమదైన ఆట తీరును ప్రదర్శిస్తుంటారు. అలాంటి వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. బుధవారం నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వీటిని చేపట్టగా ఉమ్మడి జిల్లాకు చెందిన నాలుగు జట్ల బాలురు హాజరయ్యారు. నాలుగు జిల్లాల మధ్య పోటీలు పోటాపోటీగా సాగాయి. ఫైనల్‌లో మంచిర్యాల, నిర్మల్ జిల్లా జట్లు తలపడగా విజేతగా నిర్మల్ జిల్లా నిలిచింది. విజేత జట్టు ఈనెల 7 నుంచి 10వ తేదీ మధ్య జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది.


తలపడుతున్న జట్లు

అట్టహాసంగా ప్రారంభం

పోటీలకు నిర్మల్ మున్సిపల్ ఛైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీఈవో ఎ.రవీందర్‌రెడ్డి హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బ్యాటింగ్ చేసి ఆటపై ఉన్న మక్కువ చూపి టోర్నీ ప్రారంభించారు. అంతర్జాతీయ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని నిత్యం తర్ఫీదు పొందుతూ లక్ష్యసాధన దిశగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, దిలావర్‌పూర్ ఎంఈవో కె.శంకర్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఛైర్మన్ పార్థసారథి, పెటా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భుక్య రమేశ్, కె.భోజన్న, క్రీడల నిర్వాహకుడు వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు రాష్ట్రపాల్, సాయి, గోపాల్, భూమేశ్, రాంరాజ్, శ్రీనివాస్, సంతోష్, సునీల్, సుదర్శన్, గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచి..:



మాది తాంసి మండలం పొన్నారి గ్రామం. తల్లిదండ్రులు లతీష్‌రెడ్డి-గీతారెడ్డి వ్యవసాయం చేస్తుంటారు. నాకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. మక్కువను గుర్తించి అమ్మానాన్న నన్ను ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తూ అక్కడే ఓ శిక్షణ కేంద్రంలో తర్ఫీదు ఇప్పిస్తున్నారు. వికెట్ కీపర్‌గా రాణిస్తున్నాను. గత ఏడాది ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనగా నాలోని ప్రతిభను చూసి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. జడ్చర్లలో జరిగిన టోర్నీలో ఉత్తమ క్రీడ స్ఫూర్తిని ప్రదర్శించడంతో నేషనల్‌కు ఎంపిక చేశారు. అయితే ఆ పోటీలు జరగలేదు. దీంతో అందులో పాల్గొనే అవకాశం రాలేదు. **- ఓం క్షిరాజ్‌రెడ్డి, ఆదిలాబాద్**

ఆల్‌రౌండర్‌గా..: సోమ ఇషాన్‌రెడ్డి, ఆదిలాబాద్



ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాను. ఏడేళ్ల ప్రాయంలో క్రికెట్‌పై మక్కువ పెరిగింది. మాది జైనథ్ మండలం పెండల్‌వాడ. తల్లిదండ్రులు ప్రభాకర్‌రెడ్డి-రాధారెడ్డి వ్యాపారం చేస్తుంటారు. నాలోని అభిరుచి గుర్తించి వారు నన్ను ఓ ప్రైవేటు శిక్షణ కేంద్రంలో చేర్పించారు. అక్కడ తర్ఫీదు పొందుతూ వివిధ పోటీల్లో పాల్గొన్నాను. ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాను. గత సంవత్సరం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్మల్‌లో జరిగిన జోనల్ స్థాయిలో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతోపాటు అక్కడ మంచి ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. అవి జరగకపోవడంతో ఆడే అవకాశం కోల్పోయాను.

రెండు నెలల వ్యవధి.. తండ్రీకుమార్తెలకు టీచరు కొలువులు

అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, భార్యాభర్తలు ఉద్యోగాలు సాధించడం సాధారణం. ఇందుకు భిన్నంగా రెండు నెలల వ్యవధిలో తండ్రీకుమార్తెలు టీచరు కొలువులకు ఎంపికయ్యారు. వారే జైనథ్ మండలం పిప్పర్‌వాడకు చెందిన వాయిలే రమేష్, ప్రణయశ్రీ. ఆగస్టు 2న సోషల్ వెల్ఫేర్ సొసైటీ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ బాలుర గురుకులంలో హిందీ ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ)గా వాయిలే రమేష్ ఎంపికై విధుల్లో చేరారు. తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ప్రణయశ్రీ ఎంపికయ్యారు. ఓపెన్ కేటగిరీలో 42వ ర్యాంకును సాధించిన ఆ యువతి తండ్రితో కలిసి బుధవారం ఆదిలాబాద్ డైట్ కళాశాలలో నిర్వహించిన ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. కొంతకాలంగా తండ్రీకుమార్తెలు తమ గ్రామంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో టీచర్లుగా పని చేస్తుండగా.. ఒకరి తర్వాత మరొకరు ప్రభుత్వ కొలువులకు ఎంపిక కావడం విశేషం. ఇంటి నుంచి ఒక్కరికే ఉద్యోగం రావడం గగనంగా మారిన ప్రస్తుత తరుణంలో తండ్రి 48 ఏళ్ల వయసులో.. ఆయన కుమార్తె 20 ఏళ్ల ప్రాయంలో సర్కారు కొలువులు సాధించి నేటి తరానికి స్ఫూర్తిగా నిలిచారు. వయోపరిమితి గడువు ముగుస్తున్న సమయంలో తనకు ఉద్యోగం రావడం సంతృప్తినిస్తే.. ఇప్పుడు అందరూ తండ్రికి తగ్గ తనయ అని కూతురిని పొగుడుతుంటే మనసు ఉప్పొంగుతోందని రమేష్ ఆనందం వ్యక్తం చేశారు.


ఎస్జీటీగా ఎంపికైన కుమార్తె ప్రణయశ్రీతో కలిసి ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన తండ్రి రమేష్

- ఈనాడు - ఆదిలాబాద్

- న్యూస్‌టుడే - పాలనాప్రాంగణం

జాతీయస్థాయి ఖోఖోలో తెలంగాణ జట్టుకు రజతం



రజత పతకం సాధించిన తెలంగాణ జట్టు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఝార్ఖండ్‌లో నిర్వహించిన 34వ జాతీయస్థాయి సబ్ జూనియర్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ జట్టు రజత పతకం సాధించింది. తుది పోరులో మహారాష్ట్ర జట్టుతో హోరాహోరీగా పోరాడి ఒక్క పాయింట్ తేడాతో ఓడి రన్నరప్‌గా నిలిచింది. తెలంగాణ జట్టులో ఉట్నూరు గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు సిడాం శంకర్, కుమ్ర సురేందర్, రాథోడ్ శివసాయి, ఆత్రం శివచరణ్, పెందూర్ హన్మంతు, ఆత్రం యాదవ్‌షావ్ ఉండడం విశేషం. క్రీడాకారులను ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, డీడీ ఎ.వసంత్‌రావు, జిల్లా యువజన క్రీడల అధికారి వేంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ పీడీ దయానంద్ రెడ్డి, తెలంగాణ జట్టు కోచ్ శివకృష్ణ, ఉమ్మడి జిల్లా ఖోఖో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్, శ్రీధర్‌రెడ్డి అభినందించారు.